

మనిషికి అప్పుడప్పుడు, తాత్కాలికంగా వచ్చే వైభోగాల్లో పరీక్షల సమయం ఒకటి. పరీక్షల్లోనూ, ఏదైనా జబ్బు చేసినప్పుడూ, మనకి మనచుట్టూ వుండే వ్యక్తుల మీద సంపూర్ణాధికారం వుంటుంది. అప్పుడు మనింట్లో వాళ్ళమీద మనకున్న అధికారం, ఒక దేశంమీద ఆ దేశపు రాజుకున్న అధికారంతో సమానమని చెప్పవచ్చును.

పరీక్షల్లో—(పరీక్షల ముందు ఓ పదిహేను, ఇరవై రోజులని కూడా అర్థం చేర్చుకోవాలి) విద్యార్థులెవరూ ఇంట్లో పని చెయ్య నక్కర్లేదు. ఉత్తప్పుడు, "ఒరే, బజారుకెళ్ళి ఓ వీశెడు వంకాయలు పట్టుకురా!" అనో, ఆడపిల్లయితే "కాస్త ఆ కూర తరిగివ్వవే" అనో పురమాయించి, చేసేదాకా అదేపనిగా సాధించే పెద్దవాళ్లు, పరీక్షల రోజుల్లో ఇవతలి పుల్ల తీసి అవతల పెట్టమని కూడా చెప్పరు. ఒకవేళ, ఏ తమ్ముడైనా వచ్చి "ఒరే అన్నయ్యా, ఈ సెన్సుబొమ్మ వేసిపెట్టరా" అనో, లేకపోతే ఏ చెల్లెలైనా వచ్చి "అక్కా కాస్త ఈ తాటాకుతో బొమ్మ చేసి, నీ వోణీ చింపి చీరకట్టిపెట్టవే" అనో అడిగినా "ఒరేయ్! మీరిలా రండర్రా! వాళ్ళకి పరీక్షలు, మీరెవ్వరూ మాట్లాడకండి!" అని వాళ్ళని నోరెత్తనివ్వరు. అంటే మన పరీక్షలన్నాళ్ళూ ఇంట్లో పిల్లలందరి స్వేచ్ఛకీ బంద్ అన్నమాట! వాళ్ళెవ్వరూ గట్టిగా మాట్లాడకూడదు. ఇష్టం వచ్చినట్లు గోలపెడుతూ అల్లరి చెయ్యకూడదు. "వీళ్ళ పరీక్షలెప్పుడైపోతాయిరా దేవుడా!" అని జపం చేస్తూ కూర్చోవాలి అయిపోయే వరకూను.

ఒక్క అల్లరి చెయ్యక పోవటంలోనూ, మాట్లాడక పోవడంలోనూ వాళ్ళ పాట్లు పూర్తవవు. ఇవతల ఈ పరీక్షలకు కూర్చోబోయే అదృష్టవంతులకి, 'అందింపు' అందివ్వలేక, ఈ మధ్యకాలంలో చిక్కి సగమయి పోతారు. అసలు పరీక్షల కోసం చదివేవాళ్లు రోజుకి పదిసార్లు ఫలహారాలు చేసి, నాలుగు సార్లు భోంచేసి, బొండుల్లా తయారవుతారు. పరీక్షలయిపోయేటప్పటికి. మధ్య ఈ చిన్న పిల్లల మొహాలమీద పరీక్షల ప్రభావమంతా కనబడటం!

మా చెల్లెల్ని ఒక చుట్టం "ఏమే తల్లీ! అంత చిక్కిపోయావ్?" అని అడిగితే అది చెప్పిందిగదా, "ఏం చెయ్యనండీ, మా అక్కయ్య పరీక్షలు కదూ!" అని. ఆవిడ

కుమారి ఆర్. నాంచారమ్మ

నన్ను కూడా ఓసారి పరామర్శిస్తుందేమోననుకున్నా. కాని నా సరదా తీరలేదు. ఆవిడ తప్పేమీ లేదందులో నిజానికి; అద్దంలో చూసుకుంటే, నా మటుకు నాకే "కొంచెం లావయ్యానేమో" ననిపించింది. "మళ్ళీ, 'పరీక్షలయిపోయాయిగా, ఇంక చిక్కిపోతాను ఫరవాలేదులే' అని సరిపెట్టుకున్నాను.

రోజూ "అమ్మా! కాసిని మంచినీళ్ళివ్వవే," అని మెల్లిగా వినయంగా అడిగితేనే, "ఏం దొడ్లోకెళ్ళి తోడుకుతాగలేవూ, అన్నీ అందియ్యాలి కాబోలు" నని కసురుకునేది మా అమ్మ. పరీక్షల్లో అయితే, అడగటమే తడవుగా కూల్ డ్రింకులూ, పళ్ళరసాలూ—అవీఇవీ ఏమిటి, ఏవి కావాలంటే అవి సరాసరి నోటిదగ్గరకే పట్టుకు రమ్మన్నా ఎవ్వరూ విసుక్కోరు. పైపెచ్చు, బతిమాలుతారు కూడా: "కాస్త ఈ కప్పుడు రసం తాగెయ్యమ్మా! లేకపోతే వేడి చేస్తుంది, మా అమ్మకదూ!" అంటూ.

అల్లా బతిమాలించుకోటమంటే నాకెంతో సరదా! వట్టి రోజుల్లో తీర్చేవారుండరు కాబట్టి పరీక్షల్లో దాన్ని తీర్చుకుంటూ వుంటాను. "అమ్మా! ఆ ఆకలెయ్యటములేదే!" అని అడుగు మెట్టు దగ్గరనుంచీ మొదలుపెట్టి, "ఛ, ఛ; వెధవ కూర; ఇదేమిటిట్లా వండావే? గడ్డిలా వుంది," అని కోపగించుకునే చివరిదశదాకా ప్రతిచోటా బతిమాలించుకోవచ్చు చక్కగా. మా యింట్లో మాత్రం, నా పరీక్షలన్నాళ్లూ నా ఆజ్ఞలమీదే వంటకాల్ని తయారు చెయ్యటం! వాటల్లో ఏమాత్రం తేడా వచ్చినా నేనూరుకోను. అంచేత, జాగ్రత్తగా, నా కిష్టమైన పద్ధతుల్లో లోపాలేమీ రాకుండా తయారవుతుంది భోజనం.

మనం నిజంగా చదివినా, చదవకపోయినా కష్టపడినా కష్టపడకపోయినా, ఈ ఆధిపత్యానికీ ఈ జరుగుబాటుకీ ఏమీ లోపం వుండదు. వట్టి రోజుల్లో అయితే. ఈ సౌఖ్యాలుండవు సరిగదా, రాత్రి పదిన్నర వరకూ చదవకపోతే వూరుకోరు పెద్దవాళ్ళు. నిద్రొస్తే, కాస్త టీ తాగి మెలకువగా వుందామన్నా, "వెధవ అలవాట్లు! టీ లేదు, ఏమీలేదు, కళ్ళకి నీళ్ళు రాసుకో అదేపోతుంది నిద్ర." అని కేకలేస్తారు. వుత్తప్పుడు "అప్పుడే పడకేశావూ, ఇంకా పదవన్నా కాలేదు," అని సాధించే వాళ్ళు, పరీక్షల్లో, "పగలంతా చదివేవుగా. ఇంక చాల్లే పడుకో. ఇంకా

"నిశిరాత్రి దాకా మేలుకుంటే, ఏ దైనా జబ్బు చెయ్యగలదు" అని తొమ్మిదింటికే పవ్వళింపు గీతాలు మొదలెడతారు. రోజూ ఏడున్నరకల్లా నిద్రలేవకపోతే మంగళ హారతు లెత్తుకునే వాళ్ళు, పరీక్షల్లో ఆలిండియా రేడియోవారలు వింటూ లేచినా, మొఖం కడుక్కొచ్చేటప్పటికి, కాఫీగ్లాసు రెడీగా వుంటుంది. వుత్తప్పుడట్లా లేస్తే ఆ పూట కాఫీకి స్వస్తే గాకుండా "చదువుకునే వాళ్ల లక్షణం ఇదేనా?" అనే ప్రశ్న ఇంట్లో వాళ్ళందరి నోట్లోంచీ తలోసారి వినలేక బాధపడాలి. మరి యీ లక్షణం పరీక్షల్లో వర్తించదు. "ఆ, అలిసిపోయారులే" అని సరిపెట్టుకుంటారు.

ఈ చదువూ, ప్రొద్దున్నే లేవటం, ఇవట్లా వుంచి, మామూలుగా ఇంటిపనుల్లో మా అమ్మకి సాయం చెయ్యకపోతే ఆవిడసలూరుకునే మనిషి కాదు. కొంతమందనుకుంటారు. "చదువుకునే ఆడపిల్లలు, ఇంట్లో పనులుకూడా చేస్తారా!" అని. అల్లాంటివాళ్లు ఒకసారి మా యింటికొచ్చి చూస్తే వాళ్ళ సందేహం సమూలంగా తీరిపోతుంది. అటువంటిది, పరీక్షల్లో చిన్న కంచం కూడా ఎత్తక్కర్లేదు. ఒకవేళ ఎప్పుడైనా మొహర్బానీకోసం, నేనెత్తబోయినా, "అదట్లావుంచి నువ్వెళ్ళి చదువుకోవే" అని ఎత్తనివ్వదు అమ్మ.

ఓమూల, ఇంతసౌఖ్యంగా వున్నా, మనసులో భయంగానేవుంటుంది. "ఏంచేస్తామో పరీక్షల్లో" అనేభయం, "మనంసరిగ్గా రాయగలుగుతామో, లేకపోతే పాడుచేస్తామో" ననే ఆత్రుత, తీరాచేసి, పరీక్షలో ఫెయిలయితే జరిగేమర్యాద, ఇప్పటి ఈ మర్యాద కెన్నిరెట్లు అధికంగా ఉంటుందోననే ఆలోచన, బెంగపట్టుకునేట్లు చేస్తాయి. అందుకనే పరీక్ష లయిపోయిన క్షణంలో ఏదో బరువు దింపుకున్నట్లు ప్రాణానికి హాయిగా ఉంటుంది. ఆ తరవాత, మళ్ళీ ఫలితాలకోసం ఎదురుచూడటం వేరేసంగతి.

పరీక్షల్లో అన్నంతినబుద్ధయ్యదు. అసలాకలే కాదు ఏమీ తినకపోయినా, ఎంత చక్కగావండినా. ఎంతయిష్టమైన పదార్థాలు చేసినా, నోట్లోపెట్టుకో బుద్ధయ్యదు. చచ్చిచెడి, ఏదో పెద్దవాళ్ళ బలవంతంవల్ల తిన్నా, ఆ గాభరాలో వాంతులు కూడా పట్టుకుంటాయి.

ఏదో భయం భయంగా ఉంటుంది పరీక్షలయ్యేవరకూ. పోనీ, ఆ భయంతోనైనా బాగాచదువుతామా అంటే అదీ లేదు. ఊరికే భయపడిపోవటమే కాని చదవాలని ఉండదు. ఆ ఖంగారులో పుస్తకం తెరుస్తే వచ్చిందేదో, రానిదేదో కూడా తెలియనంతటి అయోమయంగా, అగాధంగా కన్పిస్తుంది. చివరికా "పాఠాలసలెక్కడైనా విన్నానా ?" అన్న సందేహంకూడా వస్తుందొక్కోసారి.

పోనీ, చదవటంమానేసి పడుకుని నిద్రపోదామనుకుంటే అదీసాగదు. కంటిమీదికి కునుకురాదు. కళ్ళుమూస్తే ఎదురుగా పరీక్షలూ, ప్రశ్నపత్రాలూ కనిపిస్తాయి. తమాషా—వచ్చేకల లన్నీ మనం ఫెయిలయిపోయినట్టే వస్తాయి ఆ సమయంలో !

ఎక్కడలేని ఆలోచనలూ, పరీక్షల్లోనే వస్తాయి. "మిగతా వాళ్ళందరూ ఏం చేస్తున్నారో" అని సహాధ్యాయుల్ని గురించి తలుచుకుంటే "అయ్యబాబోయ్" అనిపిస్తుంది. ఎవరిమటుకు వాళ్ళు, "అందరూ చదివేస్తున్నారు. నేనే చదవటంలే"దని ఖంగారుపడిపోతారు. తీరా చదవబోతే మనస్సు నిలకడగా ఉండదు. పరీక్షల్లో ప్యాసయితే ఏంచెయ్యాలో, ఫెయిలయితే ఏవిధంగా రైలుకింద తలకాయపెట్టాలో— అన్ని ఆలోచన్లూ అప్పుడేవస్తాయి. పరీక్షల రోజుల్లోనే, ఒకప్పుడు మా స్నేహితురాలు కవిత్వంకూడా అల్లింది :—

"పరీక్ష లొచ్చేస్తున్నాయ్
గుండెలు గుభేలు మంటున్నాయ్
పుస్తకం తీస్తే అయోమయం
అది మూసేస్తే మరీభయం—"

అంటూ ఏదో, శ్రీశ్రీధోరణిలో. ఇదీ బాగానేఉంది, పరీక్షల ధర్మమాఅని ఈ అమ్మాయికి కవిత్వం పట్టుబడుతుందేమో ననుకున్నా. కాని,అందరిఆధునిక కవులకిమల్లేనే, ఆపరీక్షల ఆవేగం పోయేటప్పటికి, ఆ కవిత్వధోరణే పోయింది.

సంవత్సర మంతా లేని పశ్చాత్తాపం పరీక్షల్లో వస్తుంది, అన్నాళ్ళూ వృథాగా గడిపేసినందుకు. అప్పుడైనా, ఇన్నాళ్ళూ చదవలేదే అని విచారిస్తాం గాని, పోనీ ఈ కొంచెం సమయంలోనైనా కాస్త చదువుకుందామనే దృష్టి ఉండదు. పుస్తకం చేత్తో పట్టుకుంటే మనస్సు పరిపరివిధాల పోతుందికాని దానిమీద లగ్నం చెయ్యలేము. ఎంతచెప్పినా, పరీక్షరోజుల్లో విద్యార్థుల మనఃస్థితి పూర్తిగా మాటల్లో చెప్పడాని కలవికాదు. అదొక అనుభవైకవేద్యమైన వింతదశ. అన్నంతినలేక, నిద్రపోలేకపడే అవస్థ చూసేవాళ్ళకి నవ్వూ, జాలీ, రెండింటినీ తెప్పిస్తుంది. నిద్రలేక ఎఱ్ఱపడిన కళ్లనిచూసి "అయ్యోపాపం, పరీక్షలకోసం ఎంత కష్టపడుతున్నారో" అనుకుంటారు.

పొద్దున్న పరీక్ష అనగా, నా అనుభవాన్నిపట్టి తెలుసుకున్న విషయమేమంటే, ఆ రాత్రి, ఆ సబ్జక్టుని అసలు చూడకూడదు; తలుచుకోకూడదు. పోనీ, ఓసారి ఏం వచ్చిందో, ఏం రాలేదో చూసుకుందామని అనుకుంటే మన పనైపోయిందన్నమాటే! మన కొచ్చిందీ, పరీక్షల్లో ఇస్తే వ్రాయగలిగేదీ ఒక్కవిషయం కనబడదు. అంతవరకూ చదివిన దేమైపోతుందో, బుఱ్ఱంతా ఖాళీగా ఉన్నటనిపిస్తుంది. ఆ పరీక్షంటే హడలుపుట్టి పరీక్షలు మానేద్దామనిపిస్తుంది. అంచేత, మరీ పరీక్షలముందు మనజ్ఞానాన్ని పరీక్షించుకోకూడదు. ఆ పని మర్నాడెట్లాగూ జరుగుతుంది. మన మనుకున్నదానికంటే తేలిగ్గానే ఉంటుందికూడా.

ఎప్పటి కప్పుడు "ఈ ఒక్కసారీ ఎల్లాగో పాసయిపోతే మళ్ళీ సంవత్సరంనుంచీ జాగ్రత్తగా ఎప్పటి పాఠాలప్పుడు ముందుగానే చదివేసుకుందాం" అనుకుంటాం. కాని తర్వాత యథాప్రకారమే. ఎంత "దేముడూ లేడు, దయ్యమూ లేడు" అనే వాళ్లకైనా పరీక్షల్లో "దేముడనే వాడుండి, పరీక్ష పాసయ్యేటట్లు చేస్తే కొబ్బరికాయ కొడతా" నని అనుకో బుద్ధేస్తుంది.

పరీక్షలప్పుడు, బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోగలిగిన విద్యార్థికీ, ఏమీరాని శుద్ధ బడుద్ధాయికీ ఒకేవిధంగా ఉంటుంది మనఃస్థితి.

ఒక చెంప వెన్నెల్లోనూ, రెండవచెంప ఎండలోనూ ఉన్నట్లుగా ఉండే పరీక్షలయిపోయిన తరవాత, పెద్దభారం తగ్గిపోయినందుకు 'అమ్మయ్య' అనుకుంటాం. అదే క్షణంలో, మనకా సమయంలో ఉన్న ఆధిక్యత, ఆధిపత్యమూ ఇక ఉండవన్న సంగతి తలుచుకుంటే 'అయ్యో' అనిపిస్తుంది. ★

కుటుంబ నియంత్రణం
గర్భనిరోధానికి

స్త్రీలు సేవింపదగిన ఔషధము స్పెక్ టేబ్‌లెట్స్ (రిజిష్టర్డ్) గర్భమురాకుండేందుకు తేలికగానోటిలోవేసుకొని మింగేమందు 12 రోజులు మందు వాడిన యెడల గర్భధారణ కాకుండా చేయును..

పూర్తికోర్సు ప్యాకెట్టు
24 మాత్రలు
వెల రు 12/- వి పి అదనము
ప్రతిచోట దొరుకును

ఇండియాలోను, విదేశాలలోను ఈమందువాడినవారు అయాచితంగా అనేక యోగ్యతాపత్రములను పంపియున్నారు...

SEENU & CO.,
28 K TANDAVARAYA GRAMANI ST • MADRAS-21.
GRAMS: ORCAS. (ESTD 1946). PHONE 55357.
(ADVT. PERMITTED UNDER G O MS. NO. 1121 HEALTH)